

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**"అతని పేరు?"**

"ఏమో? రెండేళ్ళ కిందటి మాట."

"మా అమ్మకి ఫ్రెండ్స్ ఇంకెవరూ లేరా?"

"ఉన్నారు. కానీ వీళ్ళే ఎక్కువ స్నేహంగా ఉండేవాళ్ళు."

"థాంక్స్ పిన్నీ. మళ్ళీ అవసరం ఉంటే ఫోన్ చేస్తాను."

"మీ అమ్మ అలా ఎందుకు చెప్పింది? ఏప్రిల్ ఫస్ట్ కాదు కదా ఆ రోజు?" నవ్వుతూ అడిగింది జానకి.

"ఖచ్చితంగా కాదు."

"నిన్ను దత్తత తీసుకుంటే ఆ సంగతి మాకు చెప్పకుండా ఉంటుందా? అది జోక్ చేసి ఉంటుంది. దాన్ని నువ్వు సీరియస్‌గా తీసుకోకు. మొన్న ఆశీర్వచనాల రోజు నువ్వు మీ అమ్మకి చెందిన రహస్యం చెప్పమంటూ ఏదో అన్నావు. అది దీని గురించేనా?"

"అవును పిన్నీ."

ఫోన్ పెట్టేసాక త్రివిక్రం మళ్ళీ కైలాసపతిరావుకి ఫోన్ చేసాడు. ఈసారి కూడా 'అవుటాఫ్ కాలింగ్ ఏరియా' అనే వచ్చింది. ఆ తర్వాత లక్నో ఫోన్ చేసాడు. అది లేండ్ లైన్. నాలుగైదుసార్లు మోగాక ఫోన్ ఎత్తారు.

"హలో" ఓ మగ కంఠం వినిపించింది.

"హలో. జమునారాణిగారితో మాట్లాడొచ్చా?" అడిగాడు.

"క్యా? ఆప్ కౌన్? కహా సే?" హిందీలో అడిగాడు.

"ఆవిడ ఫ్రెండ్ జనని కొడుకుని. వాళ్ళిద్దరూ క్లాస్‌మేట్స్" హిందీలో చెప్పాడు.

"ఏక్ మినిట్ ఠైరీయే."

అతను హిందీలో ఏదో చెప్పడం వినిపించింది. కొద్దిసేపటి తర్వాత ఓ ఆడ కంఠం వినిపించింది.

"కౌన్ హై ఆప్?"

"నమస్తే అండి. నేను జనని కొడుకు త్రివిక్రంని మాట్లాడేది."

"జననంటే.. ఓ. నువ్వా? నిన్నెప్పుడో చిన్నప్పుడు చూసాను. మీ అమ్మ ఎలా ఉంది? నాకు మోకాళ్ళ నొప్పులు. అప్పుడే నాలుగేళ్ళయింది. పెద్దగా నడవలేను. నడిస్తే నొప్పి. కూర్చుంటే సుఖంగా ఉంటుంది కానీ లేస్తేనే సమస్య. ఆయుర్వేదం మందులు వాడుతున్నాను. కొద్దిగా నిమ్మళంగా ఉందిప్పుడు. ఈ.."ఆవిడ ధోరణి అలా కొద్దిసేపు సాగింది.

త్రివిక్రం వీలు చూసుకుని అడ్డుపడి చెప్పాడు.

"మా అమ్మ జనని రెండు వారాల క్రితం పోయింది."

"అరెరె! పోయిందా? పాపం. ఎలా పోయింది?" నిజమైన బాధ జమునారాణి కంఠంలో ధ్వనించింది.

"రోడ్డు యాక్సిడెంట్‌లో."

"రామ రామ రోడ్డు యాక్సిడెంటే? ఎలా జరిగింది?"

టూకీగా వివరించి చెప్పాడు.

"మిమ్మల్ని ఓ విషయం అడగాలని ఫోన్ చేసాను. మా అమ్మ నన్ను ఎవరి నించి దత్తత తీసుకుందో మీకు తెలిస్తే చెప్పగలరా?"

"నువ్వు దత్తత వచ్చావా? ఆ విషయమే నాకు తెలీదు చదువయ్యాక కొద్దికాలం ఉత్తరాలు రాసుకున్నాం. నాకు పెళ్ళయి లక్నోకి వచ్చేసాక అవీ ఆగిపోయాయి. మా వారికి నేను ఇతరులకి ఉత్తరాలు రాయడం ఇష్టం ఉండదు. తర్వాత ఎప్పుడూ మేం కలుసుకోలేదు. ఓ సారెప్పుడో ప్రమీల కనబడితే పాత విషయాలు మాట్లాడుకున్నాం. ప్రమీలంటే మా క్లాస్‌మేట్. దానికి 'ఝాన్సీ బాయ్ గుర్రం' అనే నిక్‌నేమ్ పెట్టి బాయిస్ ఏడిపించేవారు. అన్నిట్లోను ఫస్ట్ వచ్చేది. అన్నిట్లో చెలాకీగా ఉండేది"

ఆమె ధోరణికి అడ్డుపడి అడిగాడు త్రివిక్రం.

"ఆవిడ ఫోన్ నెంబర్ కానీ, అడ్రస్ కానీ మీ దగ్గర ఉందా?"

"లేదు."

"పోనీ ఏ ఊళ్ళో ఉంటోంది? ఆమె భర్త ఎక్కడ పని చేసేవాడులాంటివి గుర్తున్నాయా?"

"దేనికి?"

"నా స్వంత తల్లితండ్రులని కలుసుకోవాలని అనుకుంటున్నాను. ఆ వివరాలు ప్రమీలకి తెలియచ్చని."

"నా ఫోన్ నెంబర్ మీ పిన్ని జానకి ఇచ్చిందా? ఆ మధ్య ఏదో సినిమాలో అది కనపడి ఇంటికి తీసుకెళ్ళింది. లక్నోకి నైమిశారణ్యం దగ్గర. మా ఇంటికి వస్తే తీసుకెళ్తానన్నాను. రానేలేదు. అసలు మనవాళ్ళని ఎందర్ని పిలిచినా రారే? నైమిశారణ్యంలో కలి.."

"నేనెప్పుడైనా వస్తానండి. ఇంతకీ ప్రమీలగారి గురించి మీకు తెలిసింది చెప్పండి."

"ఏలూరులో ఏదో జూట్‌మిల్‌లో వాళ్ళాయన పనిచేసేవాడు. ఓసారి ఎందుకో ఏలూరు మీంచి వెళ్తూ ఉత్తరం రాస్తే వచ్చి స్టేషన్‌లో కలిసింది. భోజనం తెచ్చిచ్చింది. ఎప్పటిమాట? ముప్పై ఏళ్ళక్రితం. అప్పటికి ఇంకా రాహుల్ పుట్టలేదు. ముప్పై రెండేళ్ళయింది మా రాహుల్ పుట్టి. కాబట్టి ముప్పై ఐదేళ్ళయి ఉండచ్చు. మావాడు ఐ.ఐ.టిలో చదివాడు తెలుసా?"

"ప్రమీల భర్త పేరు గుర్తుందా? ఆయన పనిచేసే ఫ్యాక్టరీ పేరు?"

"గుర్తులేదు. అది స్టేషన్‌కి వచ్చి భోజనం పార్శిల్ ఇచ్చి వెళ్ళింది. కలకత్తాకి అనుకుంటా మా వారితో వెళ్తున్నానప్పుడు. దసరాకి కలకత్తాకి చూస్తే వెళ్ళకూడదు" జమునారాణి చెప్పసాగింది.

"అవునండి. ఉంటానండి."

"మంచిది. ఎప్పుడైనా లక్నోకి రా. నైమిశారణ్యం చూపిస్తాను. ఇక్కడికి హిమాలయాలు దగ్గరే. ఫ్రాన్స్‌లో పుడితే ఐఫిల్ టవర్, ఇండియాలో పుడితే హిమాలయాలు తప్పక చూడాలని అమితాబ్ ఏదో సినిమాలో డైలాగ్ చెప్పాడు తెలుసా? ఏం సినిమా అబ్బా అది?"

"తెలీదండి. ఉంటానండి."

"ఏదీ, నీ నెంబర్ చెప్పు. మా అక్క మనవరాలి పెళ్ళికి హైద్రాబాద్‌కి వస్తాను. అప్పుడు నిన్ను కలుస్తాను."

తన సెల్, లేండ్ లైన్ నెంబర్లు ఆవిడకి చెప్పి ఫోన్ పెట్టేసాడు త్రివిక్రం.

చేతి గడియారం వంక చూసుకుని ఆపరేషన్ థియేటర్‌కి వెళ్తూ ఇంటికి ఫోన్ చేసాడు. సుందరేశ్వర్ ఫోన్ తీయగానే అడిగాడు.

"అంతా సవ్యంగానే ఉంది."

"అంతే. అది కనుక్కుందామనే ఫోన్ చేసాను."

ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళాడు త్రివిక్రం. హైడ్రోసెల్ ఆపరేషన్‌కి ఒకతను సిద్ధంగా ఉన్నాడు.

ఆ రాత్రి మళ్ళీ కైలాసపతిరావుకి ఫోన్ చేసాడు త్రివిక్రం. ఈసారి అవుటాఫ్ కాలింగ్ ఏరియాకాదు. రింగైంది.

"హలో!" వినిపించిందో మగ కంఠం.

"హలో! నమస్కారమండి. నా పేరు త్రివిక్రం. మీకు గుర్తుందో లేదో కానీ మీ ఆవిడ విమల స్నేహితురాలు జనని కొడుకుని నేను."

"ఓ.. జనని, రాంప్రసాద్‌ల కొడుకువా నువ్వు? హోమియోపతి డాక్టర్‌వా? యం.బి.బి.ఎస్ డాక్టరా?"

"యం.బి.బి.ఎస్ డాక్టరేనండి."

"ఎలా ఉన్నారు మీ పేరెంట్స్?"

"మా అమ్మ రెండు వారాల క్రితం పోయింది."

"అరెరే ఎలా పోయింది?"

"అయ్యయ్యో సో సారి. నాన్నగారు?"

"ఆయనకి అల్జీమర్స్ వ్యాధి. అంటే గతం ఏదో గుర్తుండని వ్యాధి."

"నాకు తెలుసది. కష్టమే. అమెరికాలో దాన్ని 'అల్జీమర్స్' అంటారు ఆ స్పెల్లింగ్‌లో టి లేకపోయినా. మా అల్లుడు అక్కడే ఉంటాడు. అతని తండ్రికి ఇదే వ్యాధి. నేనే మాట్లాడేస్తున్నాను. చెప్పు బాబూ."

"మా అమ్మా నాన్నలకి నేను దత్తతకి వచ్చాను. నన్ను ఎవరు దత్తతకి ఇచ్చారో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాను. ఆ విషయాలు మీకేమైనా తెలుసా? మా అమ్మ ఎప్పుడైనా చెప్పిందా?"

"మాకు ఎన్నడూ ఆ విషయాలు చెప్పనేలేదా?"

"మీ ఆవిడకి తెలుసేమో? ఆవిడ మా ఇంటికి వస్తుందేది కదా?"

"మా ఆవిడకి తెలిస్తే నాకు తెలిసినట్లే. అది నాకెన్నడూ చెప్పలేదే"

"అడిగి చూడండి. పోనీ ఆవిడకి సెల్ ఉంటే ఆ నెంబరు ఇస్తారా?"

"ఇంకెక్కడి విమల? అది పోయి రెండేళ్ళు అవుతోంది. హైపటైటిస్ - బి వచ్చి పోయింది."

"అరెరె! ఐయాం సో సారి."

"చివర్లో బాగా సఫరైపోయింది. డాక్టర్‌వి కదా! నీకు తెలుసనుకుంటా ఆ వ్యాధి గురించి."

"తెలుసండి."

"నా నెంబర్ ఎవరిచ్చారు?"

"కొవ్వూరు బ్రాంచ్‌కి ఫోన్ చేస్తే విజయవాడలో మీ అసోసియేషన్‌లోని ప్రసాద్ అనే ఆయన మీ నెంబరు ఇచ్చారు. పొద్దున్నుంచి ట్రై చేస్తుంటే అవుటాఫ్ కాలింగ్ ఏరియా అని వచ్చింది."

"అవును. మా ఆవిడ పోయినప్పటినుంచి నేను శౌరిలింగంపల్లికి వెళ్ళి అక్కడున్న ఓ ఆశ్రమంలోని చిన్న స్కూల్లో సేవగా పాఠాలు చెప్పి వస్తున్నాను. అక్కడ టవర్స్ లేవు."

"మళ్ళీ ఏదైనా అవసరం ఉంటే ఫోన్ చేస్తాను. చిత్రాంగి తెలుసాండి?"

"ఆవిడ కూడా పోయింది. పదో రోజుకి నేను, విమల వెళ్ళాం."

కొద్దిసేపు ఆలోచించాడు త్రివిక్రం. విమల వల్ల ప్రయోజనం లేదు. జమునారాణి వల్ల కూడా. ఇక మిగిలింది ప్రమీల. వాళ్ళ అడ్రస్సులు తెలీవు. రేణుక ప్రెస్‌కి ఫోన్ చేస్తే అక్కడ చిత్రాంగి అనే ఆవిడ కొడుకు ఎవరూ పని చేయడం లేదని చెప్పారు. అతని ఫోన్ మోగింది.

"ఏమ్రా? నేను విన్నది నిజమేనా?" సోమశేఖర్ కంఠం వినిపించింది.

"దేని గురించి?"

"అదే మీ అమ్మకి నువ్వు పుట్టలేదని జానకమ్మ చెప్పింది. ఆదిశంకర్ కూడా ఇందాకే నాతో ఆ విషయం మాట్లాడాడు. నాకు ఆశ్చర్యం అనిపించి వెంటనే నీకు చేస్తున్నాను. మీ అమ్మ నిజంగా అలా చెప్పిందా?"

"అవును బాబాయ్. మా నాన్నగారు నీతో ఆ విషయాలేం ఎప్పుడూ చెప్పలేదా?"

"లేదు. అందుకే నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇది నిజం అయి ఉండదు."

"నాకైతే నిజమే అనిపిస్తోంది. పుట్టుకతోనే యుటెరిస్ లేనివారికి పిల్లలు కలగరు కదా. మా అమ్మకి అది లేదు."

"ఓ..దెన్ ఇటీజ్ వెరీ కాంప్లికేటెడ్ మీ నాన్న మాతో ఎన్నడూ ఈ విషయం చెప్పనేలేదు. ప్చ్! ఇప్పుడు ఏం చెప్పలేడు."

తర్వాత ఆదిశంకర్ నించి కూడా ఆ విషయం మీద ఫోన్ కాల్ వచ్చింది.

సెల్‌ఫోన్ చూసుకుంటే మార్గదర్శిలో పనిచేసే శ్యామలరావు నించి మిస్డ్ కాల్ ఒకటి ఉంది. వెంటనే అతనికి ఫోన్ చేసాడు.

"త్రివిక్రంని. మీ మిస్డ్ కాల్ చూసాను."

"ఏం లేదు. మీరెలా ఉన్నారో పలకరిద్దామని ఫోన్ చేసానంతే. మీ అమ్మ డెత్ సర్టిఫికెట్ కాపీలు సరిపోయాయా? లేక ఇంకా కావాలా?"

"సరిపోయాయి. ఇంక అవసరంలేదు."

"మీ అమ్మగారి పేరున ఉన్న చిట్‌కి మీరు నామినీ. ఆవిడ పేరునించి మీ పేరుకి చిట్ మార్చడానికి ఓసారి మీ దగ్గరకి వచ్చి కొన్ని కాగితాల మీద సంతకం తీసుకోవాలి. రేపు ఉదయం ఇంటికి ఎనిమిదిన్నరకి రానా? లేక హాస్పిటల్‌కి రమ్మంటారా?"

"ఇంటికి రండి."

మర్నాడు శ్యామలరావు వచ్చి ఆ ప్రకారం కాగితాల మీద, తనతో అతని పేర తెచ్చిన బాండ్ పేపర్ మీద సంతకాలు తీసుకున్నాడు.

"మీది ఏలూరా?" అడిగాడు త్రివిక్రం.

"కాదండి, బందరు. ఏం?"

"ఏలూరులో చిన్న పని ఉంది. అక్కడ మీకు తెలిసిన వారెవరైనా ఉన్నారా అని అడిగానంతే."

"ఏం పని సార్? మా బావ ఏలూరులో సేల్స్ టాక్స్ ఆఫీస్‌లో పని చేస్తున్నారు."

"అక్కడ జూట్‌మిల్‌లో ప్రమీల అనే ఆమె భర్త పనిచేస్తున్నాడు. ఆయన పేరు తెలీదు. తెలుసుకుని వారి ఫోన్ నెంబర్ నాకు సంపాదించి పెట్టాలి. ఆ పని మీ బావగార్ని అడిగితే చేస్తారా? లేదా నేనే స్వయంగా వెళ్ళాల్సి ఉంటుంది."

"ఆ జూట్ మిల్ ఇప్పుడు మూసేసారండి. నాకెలా తెలుసంటే, మా బావగారి తమ్ముడు అందులో గోడౌన్ కీపర్‌గా పనిచేసేవారు. ఆయన్ని అడిగితే ఏమైనా చెప్పగలరేమో?"

"కనుక్కోగలరా? ఆవిడ మా అమ్మ క్లాస్ మేట్ కాబట్టి ఆవిడ భర్త వయసు అరవైలలో ఉంటుంది."

అతను వెంటనే తన సెల్‌ఫోన్ నించి ఏలూరికి ఫోన్ చేసి తన బావతో క్షేమ సమాచారాలు మాట్లాడి ఆయన తమ్ముడు సదాశివ సెల్ నెంబర్ తీసుకున్నాడు. మళ్ళీ దానికి ఫోన్ చేసి ఆయనతో కూడా మాట్లాడి చెప్పాడు.

"మీ మిల్‌లో పని చేసిన ఒకరి సమాచారం కావాలి. డాక్టర్ త్రివిక్రం అని నాకు కావాల్సినాయన. ఆయన మీతో మాట్లాడతారు."

సెల్‌ఫోన్‌ని చొక్కా ఎడమ జేబుకి తుడిచి దాన్ని త్రివిక్రంకి ఇచ్చాడు శ్యామలరావు.

"హలో! నమస్తే. నా పేరు త్రివిక్రం. మీ మిల్‌లో ఒకాయన పని చేసేవారు. ఆయన భార్య ప్రమీల. మా అమ్మ ఫ్రెండ్ మా అమ్మతో చదివింది. వాళ్ళ ఫోన్ నెంబర్ కావాల్సి వచ్చింది. చెప్పగలరా?"

"ఏ సెక్షన్‌లో పని చేసేవారాయన?"

"ఆయన భార్య పేరు తప్ప ఇంకేం తెలీదు."

"కనుక్కుని చెప్తాను. మీరు చెప్పినాయన నాకు తెలుసు. ఆయన ఇల్లు కూడా తెలుసు. ఇప్పుడు అక్కడ ఉన్నారో లేదో తెలియదు. వెళ్ళి కనుక్కుంటాను. పేరు విశ్వేశ్వరరావు. రెండు రోజులాగి నాకు మళ్ళీ ఫోన్ చేయండి"

"అలాగే. తప్పకుండా. రేపోసారి మీకు రిమైండ్ చేయనా?"

"అది బెటర్" చెప్పాడు.

ఆయనకి థాంక్స్ చెప్పాక ఆ నెంబరు, త్రివిక్రం ఆయన పేరుతో తన సెల్ ఫోన్‌లో ఫీడ్ చేసుకున్నాడు.

"థాంక్స్ శ్యామలరావుగారు. మీరు మంచి సహాయం చేసారు."

అతను వెళ్ళాక సుందరేశ్వర్ అడిగాడు.

"కూరలు, పచారీ సామాను కొనాలి. జాబితా రాసాను. మీరు తెస్తారా? లేక నన్ను తీసుకు రమ్మన్నారా?"

జేబులోంచి రెండువేల రూపాయలు తీసి ఆయనకిచ్చి చెప్పాడు.

"మీరు తెస్తానంటే నాకభ్యంతరం లేదు."

"ఇల్లు కదలకుండా ఇంట్లోనే కూర్చుంటే విసుగు కాబట్టి ఈ నెపంగానైనా బయటకి వెళ్ళిరావచ్చని. ఓ గంటలో మీరు హాస్పిటల్‌కి వెళ్ళేలోగా వస్తాను."

ఆయన సంచి తీసుకుని బయటకి వెళ్ళిపోయాడు. అన్నట్లుగానే గంటలో సరుకులతో, కూరలతో వచ్చాడు. మిగిలిన డబ్బు, బిల్లులు త్రివిక్రంకి ఇవ్వబోయాడు.

"మళ్ళీ ఏమైనా కావాల్సి వస్తే కొనడానికి మిగిలిన దాన్ని మీ దగ్గరే ఉండనీయండి." చెప్పాడు త్రివిక్రం.

"మనిషికి మనిషికి పోట్లాట రావడానికి మొదటి కారణం డబ్బండీ. అందుకని నేను డబ్బు విషయంలో ఎవరి దగ్గరైనా నిక్కచ్చిగా ఉంటాను. 'లెక్క నన్ను తేల్చు లేదా నిన్ను తేలుస్తాను' అంటుందిట. ఈ రోజు లెక్క ఓసారి చూడండి."

త్రివిక్రం బిల్స్‌ని. ఆయన వేసిన లెక్కని, మిగిలిన మొత్తాన్ని చూసాడు.

"ఏట్లో పారేసినా ఎంచి పారేయాలని సామెత. లెక్క చూడటం ఎప్పుడూ అందరికీ మంచిది" నవ్వి చెప్పాడు సుందరేశ్వర్.

ఆయన చాలా విషయాల్లో 'ఆదర్శాలు గల నిక్కచ్చి మనిషి' అని త్రివిక్రంకి అర్థమైంది.

డాక్టర్ త్రివిక్రం చిల్డ్రన్స్ వార్డ్‌లోకి రౌండ్స్‌కి వెళ్ళాడు. ఇరవై మూడవ నెంబర్ బెడ్ దగ్గరకి వెళ్ళాడు. దానిమీద పదేళ్ళ ఋత్విక్ పడుకుని ఉన్నాడు. కీమోథెరపి వల్ల అతని జుట్టంతా ఊడిపోయింది. బోడిగుండు. వాడికి బ్రెయిన్ ట్యూమర్. అంత చిన్న వయసులోనే అతను కేన్సర్ వ్యాధికి గురవడం వార్డ్‌లోని వైద్య సిబ్బందికి, ఇతర రోగులకీ కూడా బాధగా ఉంది.

"హలో! హౌ ఆర్ యూ యంగ్ మేన్?" పలకరించాడు త్రివిక్రం.

"ఫైన్ డాక్టర్. హౌ ఆర్ యూ టు డే?"

"ఫైన్."

"డాక్టర్. నేను రాత్రి ఓ చిన్న కవితని రాసాను చూస్తారా?" ఋత్విక్ ఉత్సాహంగా జేబులోంచి చిన్న నోట్‌బుక్‌ని తీసి చూపించాడు.

ఆ పిల్లవాడు తన నోట్ బుక్‌లో రోజూ తనకి వచ్చే ఆలోచనలన్నిటినీ రాసుకుంటూంటాడు. ఎక్కువ భాగం అతను వాటిని కవిత రూపంలో ఇంగ్లీష్‌లో రాస్తూంటాడు.

ఐ హెర్డ్ ఏ రూమర్ దట్ ఐ గాట్ ఏ ట్యూమర్

ఐ యామ్ డేన్సర్ హే! ఐ గాట్ కేన్సర్

ఇఫ్ ది మెడిసిన్స్ ఓన్ట్ వర్క్, దెన్ ఐ విల్ బి డన్

మై హెడ్ మే బి బాల్డ్. బట్ మై హార్ట్ ఈజ్ వెరీ బోల్డ్.

అది చదవగానే త్రివిక్రమ్ గుండె కలచి వేసినట్లయింది.

"ఎలా ఉంది?" నవ్వుతూ అడిగాడు ఋత్విక్.

"మోస్ట్ రియలిస్టిక్. చాలా బావుంది."

"థాంక్స్ డాక్టర్. అందరికీ నచ్చేలా రాయాలన్నదే నా తపన."

అతనింకా ఎక్కువ రోజులు బ్రతకడని త్రివిక్రంకి తెలుసు. అతనికి ఎవరూ ఏమీ చేయగలిగింది లేదు.

వార్డుల్లో త్రివిక్రం రౌండ్స్ పూర్తిచేసుకున్నాక అతని డ్యూటీ ఆ రోజుకి అవడంతో ఇంటికి బయలుదేరాడు. అతను కారు పార్కింగ్ స్పేస్‌లోకి వెళ్ళి కారు తాళం తీస్తుంటే, అప్పుడే వచ్చి ఆగిన కారులోంచి దిగే డాక్టర్ విరజ కనపదింది.

"హలో డాక్టర్! హౌ ఆర్ యూ?" చిరునవ్వుతో పలకరించింది.

"ఫైన్. హౌ ఆర్ యూ మిసెస్ విరజా?"

"వెరీ ఫైన్. మీరు ఎదురుపడటం మంచిదైంది. మావారు ఇటీవల అమెరికా వెళ్ళినప్పుడు ఈ పుస్తకం ఫ్లైట్‌లో చదవడానికి కొన్నారు. బావుంది. నన్ను చదవమని ఇచ్చారు. ఇది మీరు చదవాల్సిన పుస్తకం, అనిపించి, మీకు ఇద్దామని తెచ్చాను."

ఆమె అందించిన ఆ పుస్తకాన్ని అందుకుని దాని అట్టమీద బొమ్మని, వెనక పుస్తకం గురించి రాసింది చూస్తూ చెప్పాడు.

"థాంక్స్"

అట్టమీద తల్లి, పిల్ల బొమ్మ ఉంది. దాని పేరు మోడ్రన్ మిరకిల్స్. టేగ్ లైన్‌గా 'అండ్ దే మెట్' అని ఉంది. వెనకాల ఆ పుస్తక పరిచయం చదివితే అది దేనికి సంబంధించిన పుస్తకమో విశదమైంది. దత్తతకి వెళ్ళిన పిల్లలు పెద్దయ్యాక తిరిగి తమ అసలు తల్లిదండ్రులని కలుసుకోవడం గురించిన యదార్థ కథనాలవి.

"థాంక్స్. సబ్జెక్ట్ ఆసక్తిగా ఉంది. చదివాక ఇస్తాను."

"ఓ.కె"

డాక్టర్ విరజ హాస్పిటల్లోకి వెళ్ళిపోయింది. త్రివిక్రం కారు ఎక్కబోతూ మొదటి పేజీలో అచ్చయిన కొటేషన్ని చదివాడు.

దత్తత అంటే ఏమిటి?

తల్లి కడుపులో కాక హృదయంలో పెరగడం.

'ఎంత బాగా చెప్పారు?' అనుకున్నాడు.

క్షణకాలం తల్లి గుర్తొచ్చి గుండె భారమైంది. నిజమే. తను తన కన్న తల్లి కడుపులో పుట్టినా, తన పెంపుడు తల్లి హృదయంలోనే పెరిగాడు.

ఆ రాత్రి తండ్రి ముందు కూర్చుని పాత డైరీలోని ఓ పేజీని చదివాడు త్రివిక్రం. 'త్రివిక్రం వయసు అప్పుడు మూడేళ్ళుంటుంది. రాత్రి వాడికి నేను దుప్పటి కప్పి పడుకోపెట్టాక మంచం దిగబోయాడు.

"ఎక్కడికి?" అడిగాను.

"నా బొమ్మ తెచ్చుకుంటాను." చెప్పాడు.

"నీ పక్కన మూడు బొమ్మలున్నాయి. అవి చాలు. పడుకో."

"సరే."

మళ్ళీ కాసేపాగి మంచం దిగబోయాడు.

"ఎక్కడికి?" అడిగాను.

"అమ్మకి గుడ్నైట్ చెప్పి వస్తాను."

"అమ్మకి ఇందాకే అది చెప్పావు. అయినా అమ్మ నిద్రపోతోంది. కదలకుండా పడుకో."

"సరే"

కాసేపాగి మళ్ళీ పక్కదిగబోయాడు.

"మళ్ళీ ఎక్కడికి?" అడిగాను.

"అమ్మ నిద్రపోతోందో లేదో చూసొస్తాను."

"కదలక. నువ్వు రేపొద్దున దాకా పక్క దిగకూడదు. అర్థమైందా? పడుకో."

నేను సినిమా లాలిపాట పాడాను. వాడు పాటయ్యాక మళ్ళీ పక్క దిగాడు.

"నిద్రపోలేదూ? ఎక్కడికి?" అడిగాను.

"నువ్వు బాగా పాడావని అమ్మకి చెప్పి వస్తాను."

"సరే. వెళ్ళి త్వరగా రా."

త్రివిక్రం ఎం.సెట్ పాసయ్యాడని తెలియగానే నాకు పై సంఘటన గుర్తుకు వచ్చింది. త్రివిక్రం తెలివైనవాడు. పైకొస్తాడు.'

అది చదివాక త్రివిక్రం తన తండ్రి వంక చూసాడు. ఆయన చాలా మాములుగా చూస్తున్నాడు. తను విన్న విశేషాల వల్ల ఆయనలో ఎలాంటి స్పందన కలగలేదు.

మనిషి జీవితం ఓ జ్ఞాపకాల దొంతర. అవి లేకపోతే అతను లేడు. తన తండ్రి మెదడులోని అమైలాయిడ్ మాంసకృత్తులు ఎక్కువగా పేరుకుపోయి మెదడులోని నాడీ కణాలు పరస్పరం, నిరంతరం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే వ్యవస్థ తీరు మీద దెబ్బతీసాయి. క్రమేపీ ఒక్కో కణం నాశనమై జ్ఞాపకాలు నశించిపోవడం చాలాకాలం క్రితమే ఆరంభం అయింది.

డైరీలోని మరికొన్ని పేజీలని చదివి దాన్ని మూసేసాక అడిగాడు రాంప్రసాద్.

"ఇక్కడ తలుపు ఉండాలి. ఏమైంది?"

"నాన్నగారూ! మనం ఇదివరకు ఉన్న ఇంట్లో బెడ్ రూంకి తలుపు అక్కడ ఉండేది. మనం ఇల్లు మారాం. ఈ ఇంటి గదికి తలుపు ఇక్కడ ఉంది" ఓపికగా చెప్పాడు త్రివిక్రం.

"ఆయనకి పాత ఇంటి జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ ఈ కొత్తింటికి మారిన తర్వాత జ్ఞాపకాలు పోయినట్లున్నాయి." అల్జీమర్స్ వ్యాధి గురించి తెలిసిన సుందరేశ్వర్ చెప్పాడు.

"అవును. నా పేషెంట్ ఒకతను అకస్మాత్తుగా ఓ రోజు తన కోడలిని అడిగాడు. 'నువ్వెరమ్మాయి? మా ఇంట్లో ఎందుకు ఉంటున్నావ్?' అని.

'నేను మీ కోడల్ని మామగారూ. మీ అబ్బాయి భార్యని.' అంటే,

'మా అబ్బాయి చదువుకోడానికి అమెరికాకి వెళ్ళి ఇంకా తిరిగి రాలేదు. నువ్వు అబద్ధం చెప్తున్నావు.'అని గొడవ పెట్టుకున్నాడు. అతనికి పాత జ్ఞాపకాలు గుర్తున్నాయి కానీ కొత్తవన్నీ పోయాయి. ఆయనకి ఇలా అసాధారణ మతిమరుపు కలిగేదాకా దాన్ని వృద్ధాప్యంలో వచ్చే మతిపరుపుగా కుటుంబ సభ్యులంతా భావించారు తప్ప, ముందే అదో భయంకర వ్యాధి అని తెలుసుకుని చికిత్స ఆరంభించలేదు."

"కుటుంబంలోని ఎవరికైనా అల్జీమర్స్ వ్యాధి వస్తే బాధపడాల్సింది, ఇబ్బందికి గురవ్వాల్సింది కుటుంబ సభ్యులే కాబట్టి వారు తమ కుటుంబ సభ్యుల మతిమరుపుని నిర్లక్ష్యం చేయకుండా ఉంటే మంచిది. వారికి దానిమీద ఓ అవగాహన కలిగి ఉండటం మంచిది."

"విటమిన్ బి ట్వెల్వ్ లోపిస్తే, తీవ్రస్థాయి మతిమరుపు రావచ్చు. ఇది ముఖ్యంగా శాకాహారుల్లో ఎక్కువగా కనిపిస్తోంది. తగిన మాత్రలు ఇవ్వడం ద్వారా దీన్ని ఆదిలోనే అధిగమించవచ్చు."

ఇద్దరూ వైద్య సిబ్బందే కాబట్టి వారిద్దరూ ఆ విషయాలు కొద్దిసేపు మాట్లాడుకున్నారు.

కాసేపాగి అడిగాడు రాంప్రసాద్.

"ఇక్కడ ఇదివరలో ఓ తలుపు ఉండాలి. అదేమైంది?"

మళ్ళీ ఓపిక త్రివిక్రం ఆ ఇందాకటి ప్రశ్నకి ఇందాకటి జవాబే చెప్పాడు. అదొక్కటే అల్జీమర్స్ వ్యాధిగ్రస్థులకి కుటుంబ సభ్యులు, బంధువులు చేయగలిగేది. సహనం, ఓపిక, చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పడం.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments